నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
19 వ వసంతంలోకి ...
ఎన్టీఆర్ కృష్ణా
గురువారం 25 డిసెంబర్ 2025 పేజీలు 8



# కృష్ణాజిల్లా రాష్ట్రంలో టాప్-5లో రావాలి

■ టెన్త్ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచనలు ■ అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఎప్పటికప్పుడు మననం చేసుకుంటూ 10 వ తరగతి పరీక్షలను ధైర్యంగా వ్రాసి మంచి మార్కులు సాధించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యార్థులకు ఉద్బోధించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో నియోజకవర్గం పరిధిలోనీ 10 వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతి పరీక్షలు ఎలా రాయాలో అని భయపడవద్దని, ఒక పద్ధతి ప్రకారం చదువుకుంటే పరీక్షలు సులభంగా వ్రాయవచ్చన్నారు. విద్యార్థులు చదువుకుంటూ పోవడం కాకుండా చదివిన తర్వాత కొంచెం సేపు కళ్ళు మూసుకుని ఆ చదివిన అంశం పైన ఎంతవరకు గుర్తుకు వస్తుందో మననం చేసుకోవాలన్నారు ఆ విధంగా చేసినప్పుడే వారికి చదివిన విషయాలపైన పట్టు సాధించవచ్చన్నారు. రోజుకు 7 నుంచి 8 గంటలు నిద్రపోవాలని ఆ సమయంలోనే మెదడు అప్రమత్తమవుతుందన్నారు. ఇవన్నీ కూడా తన స్వానుభావంతో చెబుతున్నానని కలెక్టర్ తన చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకుంటూ తాను కూడా కర్ణాటకలో ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం చేశానన్నారు. పదో తరగతి నుంచి తాను బాగా చదవడం మొదలు పెట్టానని, కలెక్టర్ స్థాయికి చేరుకున్నానని విద్యార్థులకు ఎలా చదువుకోవాలి ఏ పద్ధతి పాటిస్తే చదువుకున్న విషయాల పైన పట్టు సాధించవచ్చునీ అందరికీ అర్థమయ్యే రీతిలో విశదీకరించారు. బాగా చదువుకుంటూ ఆహారం పైన కూడా శ్రద్ధ పెట్టాలని మిగతా 2లో...

## గతంలో ఏ ఎంపీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించలేదు

- ఎంపీ కేశినేని శివనాథ్ కృషిని కొనియాడిన ఎమ్మెల్యేలు బొండా, గద్దె
- సీఎం చంద్రబాబు ఆలోచనల ప్రతిరూపమే నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం
- ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడి
- చెదలు-బొద్దింకలు-దోమల నివారణ చర్యలపై శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్స్ అందజేత
- ఎంపీ కేశినేని శివనాథ్, కేశినేని ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎస్.హెచ్.జి మహిళలు 2




## పర్యాటక అభివృద్ధిలోనూ..

# స్పీడ్ ఆఫ్ డూయింగ్

- వినూత్న నమూనాలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- క్యాలెండర్ ప్రకారం పర్యాటక కార్యక్రమాలు
- కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి పిలుపునిచ్చిన స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్ఫూర్తికి అనుగుణంగా పర్యాటక రంగ అభివృద్ధికి కూడా సమష్టిగా కృషిచేయాల్సిన అవసరముందని, టూరిజంలో వినూత్న నమూనాలను ప్రభుత్వం ఎప్పుడూ ప్రోత్స హిస్తుందని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. బుధ వారం జిల్లా కలెక్టరేట్‌లోని శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా పర్యాటక కౌన్సిల్ (డీటీసీ) సమావేశం జరి గింది. పర్యాటక శాఖ అధి కారులతో పాటు ట్రావెల్స్, బోటింగ్ అసోసియేషన్ల ప్రతినిధులు హాజరైన ఈ సమావేశంలో కొండపల్లి ఎక్స్‌పీరియన్స్ మిగతా 2లో






# కృష్ణాజిల్లా రాష్ట్రంలో టాప్-5లో రావాలి



(మొదటిపేజీ తరువాయి)

చాలామంది సరిగా తినకపోవడంతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. చదివేముందు నాలుగైదు సార్లు యోగాలో భాగంగా ప్రాణాయామం చేయడం కూడా ముఖ్యమన్నారు. సమయం ఉంటే చదివిన విషయాలను వ్రాస్తే ఇంకా శక్తివంతంగా ఉంటుందన్నారు. ఇకపై ఎవరూ కూడా పరీక్షలు ఎలా రాయాలి అని ఆందోళన ఉండకూడదన్నారు. సమయం లేనప్పుడు ముఖ్యమైన ప్రశ్నలకు సమాధానాలు చదువుకోవాలన్నారు. ప్రస్తుతం ఇంకా 3 నెలల కాలం ఉన్నందున అందరూ చిత్త శుద్ధితో బాగా చదివి అత్యున్నత మార్కులు మంచి ర్యాంకులు సాధించాలన్నారు. బాగా కష్టపడి చదవాలని పరీక్షల్లో కొద్దిగా మార్పులు తగ్గిన నిరాశ చెందవద్దని, ఒక్క పదవ తరగతితో అంతం కాదని జీవితంలో ఇంకా సాధించవలసినవి ఎన్నో ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని విద్యార్థులందరూ బాగా చదువుకొని నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉద్దేశంతో ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం చేపట్టామన్నారు. ఇటీవల కాలంలో 95 నుంచి 96% ఉత్తీర్ణత సాధించినప్పటికీ గత సంవత్సరం 1,572 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా తెలుగులో 50 మంది తప్పారని, మన మాతృభాష తెలుగు అయినప్పటికీ తెలుగు భాషలో తప్పడం చాలా బాధాకరమైన విషయం అన్నారు. అలాగే 5 మంది హిందీలోనూ, 50 మంది ఆంగ్లంలోనూ, 120 మంది గణితంలోనూ, 116 మంది సాంఘిక, సామాన్య శాస్త్రంలోనూ తప్పారన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యం తెలుసుకొని అందుకు తగ్గట్టుగా అన్ని సబ్జెక్టులలోనూ అవగాహన కలిగించి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఇందులో భాగంగానే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎట్టి పరిస్థితుల్లోనూ నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఇందులో భాగంగానే ఇటువంటి నిష్ణాతులైన ఉపాధ్యాయులచే శిక్షణా కార్యక్రమాలు చేపట్టి విద్యార్థుల సామర్థ్యం పెంచడంతో పాటు అదనపు తరగతి గదులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.. ఈ అవకాశాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పరీక్షలు తప్పుతామనే భయం వదిలి పెట్టాలని, ధైర్యంగా పరీక్షలు వ్రాస్తామనే నమ్మకం పెంచుకోవాలన్నారు. వచ్చే నెలలో సాంస్కృతిక, లలిత కళల పోటీలు నిర్వహిస్తామని, అందులో ప్రతిభ చూపిన వారిని గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు. ఏ కళలో ఎవరికి అభిరుచి ఉన్నా పాల్గొని వారి నైపుణ్యాన్ని ప్రదర్శించాలన్నారు. కేవలం విద్యకే పరిమితం కాకుండా వివిధ రంగాల్లో కూడా విద్యార్థులు రాణించాలన్నారు. ఎంత చదువు చదివినా



క్రమశిక్షణ లేనిదే జీవితంలో రాణించలేమన్నారు. పరీక్షలు వ్రాసేటప్పుడు దస్తూరి బాగుంటే మంచి మార్కులు వస్తాయన్నారు తొలుత జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ తో కలిసి పురిటిగడ్డ తెలుగు భాష ఉపాధ్యాయురాలు డా. ఓలేటి ఉమా సరస్వతి రూపొందించిన తేనె చినుకులు అనే బడి పిల్లల కవితల పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తేనె చినుకులు పుస్తకాన్ని రూపొందించిన తెలుగు ఉపాధ్యాయురాలు ఓలేటి ఉమా సరస్వతిని, విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులకు శిక్షణ తరగతులను ఏర్పాటచేసిన కరస్పాండెంట్ పాండురాజు లంకమ్మ ప్రసాద్ ను, కౌసల్ కార్యక్రమంలో దివిసీమలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థి చావా మోక్షజ్ఞను జిల్లా కలెక్టర్ శాసనసభ్యులు అభినందిస్తూ ఘనంగా సత్కరించారు. తదనంతరం జిల్లా కలెక్టర్ శాసనసభ్యులు పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి మెప్మా పీడీ సాయిబాబు, జిల్లా విద్యాధికారి సుబ్బారావు, విద్యానికేతన్ కరస్పాండెంట్ లంకమ్మ ప్రసాద్, పలువురు ఎంఈఓ లు, ఉపాధ్యాయులు, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, మోపిదేవి మండలాలలోని విద్యార్థులు పాల్గొన్నారు.



## పర్యాటక అభివృద్ధిలోనూ..

# స్పీడ్ ఆఫ్ డూయింగ్

(మొదటిపేజీ తరువాయి)

సెంటర్, హోమ్‌స్టేలు, పర్యాటక ఈవెంట్లు, ట్యాక్సీ యాప్ తదితరాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు తీసుకున్న నిర్ణయాల సత్వర అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడిదారులకు పూర్తిస్థాయి సహాయసహకారాలు అందజేయడం జరుగుతుందన్నారు. పర్యాటక రంగ సుస్థిర అభివృద్ధికి, స్థానిక ప్రజలకు ప్రత్యక్షంగా ఆర్థిక ఫలాలు అందించడంలో హోమ్‌స్టేలు కీలకపాత్ర పోషిస్తాయని.. వీటిపై ఔత్సాహికులకు అవగాహన కల్పించి, రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. పర్యాటక సేవలు, ప్రత్యేక ప్యాకేజీలకు సంబంధించిన సమస్త సమాచారం అందుబాటులో ఉన్న ట్యాక్సీ యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ప్రతి ఆటో, ట్యాక్సీలోనూ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, ప్యాకేజీలకు సంబంధించిన బ్రోచర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిజిటల్ కంటెంట్ ద్వారా కూడా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కొండపల్లి ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని.. హౌస్ బోట్, హెలీ టూరిజం తదితరాలపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని సూచించారు. డిమాండ్ దృష్ట్యా వీలైనన్ని ఎక్కువ హౌస్ బోట్‌లు ఏర్పాటుచేసేలా ఔత్సాహికులను ప్రోత్సహించాలన్నారు. జనవరి 8 నుంచి మూడు రోజులపాటు జరగనున్న ఆవకాయ్ సినిమా, సంస్కృతి, సాహిత్యాల అమరావతోత్సవాన్ని విజయవంతం చేసేందుకు టూరిజం అధికారులు సమష్టిగా కృషిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ ఆర్‌డీ వైవీ ప్రసన్నలక్ష్మి, ఎన్‌టీఆర్ జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, ఏపీటీడీసీ ఈఈ ఎం.శ్రీనివాసరావు, బీఐటీసీ ఈడీ జి.ఉమామహేశ్వరరావు, డా. తరుణ్ కాకాని (అమరావతి బోటింగ్ క్లబ్), వాటర్ ఫ్లీట్ జీఎం నాంచారి, డీఆర్‌డీఏ, మెప్మా తదితర సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గతంలో ఏ ఎంపీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించలేదు



**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటి వరకు ఏ ఎంపీ స్వయం ఉపాధి రంగంలో కేంద్ర సంస్థలు అందించే నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ఏ మహిళలను పంపించలేదని...ఎస్.హెచ్.జి మహిళల జీవనోపాధి మెరుగుపర్చేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ తన సొంత నిధులతో హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి లో శిక్షణ ఇప్పించటం చాలా గొప్ప విషయమంటూ ఎంపీ కేశినేని శివనాథ్ కృషి ని ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్ అభినందించారు. అలాగే ఎంపీ కేశినేని శివనాథ్ సీఎం చంద్రబాబు ప్రతి కుటుంబానికి ఒక పారిశ్రామిక వేత్త వుండాలన్న ఆలోచనలకు ప్రతిరూపమే ఎస్.హెచ్.జి మహిళలకు ఎన్.ఐ.ఆర్.డి లో నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం అన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ సారథ్యంలో కేశినేని ఫౌండేషన్, ఎన్స్వు ఇండియా మరియు ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా మెప్మా ఎస్.హెచ్.జి మహిళలకు ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో చెదలు-బొద్దింకలు-దోమల నివారణ చర్యలపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణా ముగింపు కార్యక్రమం బుదవారం ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ కేశినేని శివనాథ్ తో పాటు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడు రోజలు శిక్షణ ను విజయవంతంపూర్తి చేసిన 50 మంది మహిళలకు సర్టిఫికెట్స్ అందజేశారు. అలాగే చెదలు-బొద్దింకలు-దోమల నివారణ చర్యలపై శిక్షణను అందించిన ఎన్.ఐ.ఆర్.డి ఫెస్ట్ మేనేజ్మెంట్ ట్రైనీ కో ఆర్డినేటర్ ఉదయ్ మీనన్, కీటకాల మేనేజ్మెంట్ ట్రైనర్ జి.ఎస్.ఎస్.ప్రకాష్ లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి జిల్లాలోని మెప్మా, డ్వాక్రా మహిళలకు ఆర్థిక పరమైన సహకారం లభిస్తుందని, అయితే స్వయం ఉపాధి రంగంలో ఏ వ్యాపారం చేయాలి...అందుకు ఎక్కడ శిక్షణ తీసుకోవాలనే వాటిపై వారికి అవగాహన లేదన్నారు. అందుకే కేశినేని ఫౌండేషన్ ఎన్.ఐ.ఆర్.డి సహకారంతో ఎస్.హెచ్.జి మహిళలకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్లాస్టిక్ వాడకం నిషేధం కావటంతో పేపర్ ఉత్పత్తులకు, జ్యూట్ బ్యాగులకు మార్కెట్లో మంచి గిరాకీ వుంది. అందుకే ఆ ఉత్పత్తులతో పాటు వర్మికంపోస్టింగ్, , బయో పెస్టిసైడ్స్ అండ్ నీమ్ బేస్డ్ ప్రొడక్ట్స్ , వర్మికంపోస్ట్, ముష్రూమ్ కల్టివేషన్ అండ్ ప్రాసెస్, హనీ మేకింగ్ ప్రాసెసింగ్, సోయా అండ్ మిల్లెట్ ప్రొడక్ట్స్ ప్రిపరేషన్, లీఫ్ ప్లేట్ అండ్ కప్ మేకింగ్, డైయింగ్ అండ్ వీవింగ్ ఆఫ్ ఫ్యాబ్రిక్స్ , హ్యాండ్ మేడ్ పేపర్, ట్రైబుల్,ఫ్యాషన్ అండ్ పేపర్ జ్యువెలరీ , హోమ్ బేస్ట్ ప్రొడక్ట్స్ , బంజారా డ్రెస్ తయారీ, బంజారా జ్యువెలరీ పై కూడా శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఈ డిసెంబర్ లోనే దాదాపు 400 మంది ఎస్.హెచ్.జి మహిళలకు ఎన్.ఐ.ఆర్.డి లో శిక్షణ ఇప్పించటం జరిగిందన్నారు. వీరికి శిక్షణ ఇప్పించటమే కాకుండా వారు తయారు చేసే వస్తువులకు కూడా మార్కెటింగ్ సపోర్ట్ అందిస్తామని భరోసా ఇచ్చారు. డ్వాక్రా బజార్లు, మెప్మా బజార్లు ఏర్పాటు చేసి రోటేషన్ పద్దతిలో వారం రోజులు ఉచితం ఎస్.హెచ్.జి మహిళలకు ఇచ్చే విధంగా కృషి చేస్తున్నాట్లు తెలిపారు. అర్బన్ ఎస్.హెచ్.సి, డ్వాక్రా మహిళలకు మూడు రోజులు చెదలు-బొద్దింకలు-దోమల నివారణ చర్యలపై శిక్షణ ఇప్పించటం జరిగిందన్నారు. సిటీలో దోమలు, బొద్దింకలు,చెదలు నివారణ చాలా ముఖ్యమన్నారు. ఫెస్ట్ కంట్రోలర్స్ కి చాలా డిమాండ్ వుందన్నారు. ఈ రంగంలో మహిళలు రాణించటానికి చాలా అవకాశం వుందన్నారు. ప్రతి నెల 250 మంది మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణా ఇప్పించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. విజయవాడలో మూడు , ఎన్.ఐ.ఆర్.డి మూడు బ్యాచ్ లకు శిక్షణ అందించే విధంగా ప్రణాళిక రూపకల్పన చేయటం జరిగిందన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల ఆర్థిక పరిస్థితి మెరుగుపడ్డాయన్నారు. ఎన్డీయే కూటమి మహిళల సాధికారత మొదటి ప్రాధాన్యత గా భావిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో ఎన్టీఆర్ జిల్లా అభివృద్దితో పాటు ఎస్.హెచ్.జి మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ చేస్తున్న శ్రమ ఫలిస్తోందన్నారు. సిల్క్ డెవలప్ మెంట్ ద్వారా స్వయం ఉపాధి రంగంలో శిక్షణ ఇప్పిస్తున్నారని తెలిపారు. ఇక సీఎం చంద్రబాబు నాయుడు ఎమ్.ఎస్.ఎమ్.ఈ పార్క్ లు ప్రతి నియోజకవర్గంలో నెలకొల్పేందుకు కృషిచేస్తున్నారని తెలిపారు. ఎన్.ఐ.ఆర్.డి లో శిక్షణ పొందే మహిళలకు ఎమ్.ఎస్.ఎమ్.ఈ పార్క్ లు ఎంతో ఉపయోగంగా ఉంటాయన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ చొరవ , కృషి వల్ల మాత్రమే మహిళలకు శిక్షణ ఇప్పించటం సాధ్యపడిందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ పురుషుల కంటే మహిళలు శక్తివంతులు అని గుర్తించి వారిని ప్రోత్సహించిన తొలి ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఆయన సీఎం అయిన ప్రతిసారి మహిళల కోసం ఒక కొత్త పథకం ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి పునాది వేశాడన్నారు. సీఎం చంద్రబాబు స్ఫూర్తితో ఎంపీ కేశినేని శివనాథ్ ఎన్.ఐ.ఆర్.డి ను సందర్శించి అక్కడ అందించే నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యాక్రమాలపై అవగాహన పెంచుకుని... ఎస్.హెచ్.జి మహిళలకు శిక్షణ ఇప్పించి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయటం శుభపరిణామన్నారు. ప్రస్తుతం ఫెస్ట్ కంట్రోల్ కు మంచి డిమాండ్ వుందని, నగరంలో ఫెస్ట్ కంట్రోలర్స్ అవసరం చాలా వుందన్నారు. ఈ శిక్షణను అందిపుచ్చుకుని మహిళలు ఈ రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, మాజీ ఎమ్మెల్సీ టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న మాట్లాడుతూ జిల్లా అభివృద్ది తో పాటు ప్రజల జీవనోపాధి మెరుగుదలకు చక్కటి ప్రణాళికతో ఎంపీ కేశినేని శివనాథ్ ముందుకు వెళుతున్నాడని కొనియాడారు. ఇక్కడ శిక్షణ నేర్చుకున్న మహిళలు..ఇంకొంత మంది మహిళలు శిక్షణ తీసుకునే విధంగా స్ఫూర్తి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్స్వు ఇండియా కంపెనీ ప్రతినిధి మొక్కపాటి అనిల్ కుమార్, ఎన్.ఐ.ఆర్.డి అధికారి మురళీ కృష్ణ, ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి రూరల్ కో ఆర్డినేటర్ సొంగా సంజయ్ వర్మ, ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి అర్బన్ కో ఆర్డినేటర్ వల్లభనేని నరసింహాచౌదరి, ఎన్టీఆర్ జిల్లా మెప్మా అధ్యక్షురాలు మీనాక్షి, టిడిపి నాయకులు మాదిగాని గురునాథం, యెర్నేని వేదవ్యాస్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పురమిత్ర యాప్ పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించండి



విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : ప్రజల సమస్యలను తీర్చేందుకు రూపొందించిన ప్రత్యేక యాప్- "పురమిత్ర" ద్వారా ఇంటి వద్దనే ఉంటూ ప్రజలు తమ సమస్యను అధికారులకు తెలియ చేయవచ్చని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు. బుధవారం ఉదయం శాఖాధిపతులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలి కాన్ఫరెన్స్లో పురమిత్ర యాప్ పై ప్రజలందరికీ తెలియజేయాలని, వారికి విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో గల సమస్యలను ఇంటి వద్దనే ఉంటూ యాప్ ద్వారా అధికారులకు తెలియజేయవచ్చని, అధికారులు వెంటనే స్పందించి ఆ సమస్యలను త్వరగా పరిష్కరిస్తారని ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పురమిత్ర యాప్ ని అందుబాటులోకి తెచ్చిందని, నగర ప్రజలు ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ప్లే స్టోర్ లో డౌన్లోడ్ చేసుకొని, పురమిత్ర యాప్ ద్వారా ప్రజలు మున్సిపల్ సేవలు, ఫిర్యాదులు, పన్ను చెల్లింపులు, జనన, మరణ, వివాహ ధృవీకరణ పత్రాలు వంటి దాదాపు 122 పురపాలక సేవలు పొందవచ్చన్నారు. సమస్యలను ఫిర్యాదుతో పాటు ఫోటోలను కూడా అప్లోడ్ చేయవచ్చని తెలిపారు. వీధి దీపాలు, చెత్త పేరుకుపోవడం, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అంశాలపై ఫిర్యాదులు, సేవల కోసం దరఖాస్తు, వాటి పరిష్కార స్థితిని తెలుసుకోవానికి ట్రాకింగ్ కూడా ఉంటుందన్నారు. ఫిర్యాదులు, సేవల పరిష్కారానికి నిర్దేశిత గడువు ఉంటుందన్నారు. ఆస్తి పన్ను నీటి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, డ్రైనేజి చార్జీలు, ఆస్తి పన్ను మ్యుటేషన్ ఫీజు, షాప్ లీజులు, అగ్రిమెంట్ ఫీజులు, అడ్వర్టైజ్మెంట్ ట్యాక్స్లను యాప్ ద్వారా ఇంటి వద్ద నుండే చెల్లించే అవకాశం ఉందని తెలిపారు. వచ్చే వారం నుండి వార్డ్ సచివాలయాల వారిగా ప్రజలకు యాప్ డౌన్లోడ్, వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

# ప్రజారోగ్యం ప్రాధాన్యత ముఖ్యమంత్రి సహాయ నిధి



పెడన, మేజర్ న్యూస్ : ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ పేద వర్గాల అందరికీ వైద్య సేవలు అందించేలా కూటమి ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందని నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రు. 15.80 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ... పేదవర్గాలందరికీ వైద్య సేవలు అందించేలా కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలువురు పేదలు పలు ఆసుపత్రులలో వివిధ రకాల చికిత్సలు పొందిన 31 మందికి మంజూరు అయిన రు. 15 లక్షల 80 వేల 888 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులు, రెండు ఎల్.ఓ.సి. లను లబ్దిదారులకు అందించారు. దీంతో లబ్దిదారులు కూటమి ప్రభుత్వానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ నాయకులు తదితరులు ఉన్నారు.

# కన్నీటి వేళ అండగా ఎమ్మెల్యే యార్లగడ్డ

**మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహనరావు మాతృమూర్తికి ఘన నివాళులు.**

**వరుస పరామర్శలతో యార్లగడ్డ వెంకట్రావు బిజీబిజీ..**





గన్నవరం, డిసెంబర్ 24, మేజర్ న్యూస్ : ప్రజల కష్టాల్లో భరోసాగా నిలిచేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు బుధవారం నియోజకవర్గ పరిధిలోని విజయవాడ రూరల్, గన్నవరం, ఉంగుటూరు మండలాల్లో వరుస పరామర్శ కార్యక్రమాల్లో పాల్గొని అనారోగ్యంతో బాధపడుతున్నవారికి, విషాదంలో ఉన్న కుటుంబాలకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రామవరప్పాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు బొమ్మసాని అరుణ, మొవ్వ ఆంజనేయులు, మెండే అప్పారావులు అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో వారి స్వగృహాలకు వెళ్లి పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఇదే క్రమంలో గన్నవరం మండలం, గన్నవరం టౌన్లో తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జి తులిమెల్లి ఝాన్సీ ని, వారి కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గన్నవరం ఎస్సీ కాలనీ వాసులైన వి. రత్నాకరరావు ఇటీవల పరమపదించిన నేపథ్యంలో, స్థానిక అంబేద్కర్ పార్క్ సమీపంలోని వారి స్వగృహానికి వెళ్లి దివంగతుల చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కష్టసమయంలో తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ వరుస పరామర్శల్లో తెలుగుదేశం పార్టీకి చిరకాలంగా సేవలందించిన ప్రముఖ నాయకులు, మాజీ రాజ్యసభ సభ్యులు కంభంపాటి రామ్మోహనరావు మాతృ మూర్తి, దివంగత కంభంపాటి వెంకట నరసమ్మ పరమపదించిన నేపథ్యంలో, ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లి గ్రామంలోని వారి స్వగృహానికి వెళ్లిన యార్లగడ్డ దివంగతుల చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె పార్టీకి, సమాజానికి చేసిన సేవలను స్మరించుకుంటూ శోకసంతప్త కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అదే గ్రామానికి చెందిన స్వర్గీయ యలమంచిలి బేబీ సరోజినీ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే కటారి రాము ఇటీవల పరమపదించిన నేపథ్యంలో వారి స్వగృహానికి వెళ్లి దుఃఖసంతప్తులైన కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఈ అపార నష్టాన్ని భరించే మనోధైర్యాన్ని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా ప్రజలైనా, పార్టీ నాయకులైనా ఎవరి కష్టమైనా తనదిగా భావించి స్పందించడమే తన రాజకీయ జీవన విధానమని ఈ సందర్భంగా శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వడ్రాణం హరిబాబు, గుడపాటి తులసిమోహన్, నబిగాని కొండయ్య, జాస్తి శ్రీధర్, మున్నా రామకృష్ణ, కొల్లా ఆనంద్, అద్దేపల్లి సాంబశివరావు, కుందేటి చంద్రశేఖర్, కొండేటియ వెంకటేశ్వరరావు, కలపాల కిరణ్, పట్టపు వెంకటేశ్వరరావు, కాసర్నేని రంగబాబు, బుస్సే నాగప్రసాద్, జొన్నలగడ్డ సుధాకర్, అన్నే హరికృష్ణ, షేక్ ఫిరోజ్, తిరువీధి నరేష్, సూరిబోయిన రాంబాబు, అలిగోజీ నాగబాబు, వంగా అయ్యప్పరెడ్డి, మోర్ల నాగబాబు, పడమట రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## డార్క్ చాక్లెట్ బాదం ఆరెంజ్ కేక్తో పండుగ వేడుకలను జరుపుకోండి



విజయవాడ మేజర్ న్యూస్ : ఈ నూతన సంవత్సరం సందర్భంగా, బాదం పిండి, రిచ్ డార్క్ చాక్లెట్, తాజా ఆరెంజ్ తొక్క తురుము, మేపుల్ సిరప్ల కలయికతో తయారు చేసే 'డార్క్ చాక్లెట్ బాదం ఆరెంజ్ కేక్'తో మీ వేడుకలకు వెచ్చదనాన్ని, ఆనందాన్ని జోడించండి. చెఫ్ కబితా సింగ్ ఎంతో ఆలోచించి రూపొందించిన ఈ వంటకం... పండుగ రుచులకు, ఆరోగ్యకరమైన బేకింగ్ విధానానికి మధ్య చక్కటి సమతుల్యతను పాటిస్తుంది. నెయ్యి, గుడ్లు, బాదం పిండితో తయారు చేయడం వల్ల ఈ కేక్ మెత్తగా, తేమగా ఉంటుంది. ఇందులో చాక్లెట్, సిట్రస్ రుచులు అద్భుతంగా కలుస్తాయి. పోషకమైనదిగా, అదే సమయంలో ఆనందదాయకంగా ఉండే ఈ డెజర్ట్ సంవత్సరాంతపు వేడుకలకు సరిగ్గా సరిపోతుంది. ఇది తయారు చేయడం చాలా సులభం, అందరితో పంచుకోవడానికి సరైనది, పండుగ బేకింగ్కు ఒక ఆధునిక రూపం. పండుగ సమయాల్లో ఆహారం గురించి తన అభిప్రాయాన్ని పంచుకుంటూ మ్యాక్స్ హెల్త్కేర్ రీజినల్ హెడ్ - డైటెటిక్స్ రితికా సమద్దార్ ఇలా పేర్కొన్నారు. "పండుగ ఆహారం అంటే అతిగా తినడం లేదా ఆరోగ్యాన్ని పణంగా పెట్టడం కాదు. కాలిఫోర్నియా బాదంలో ప్రొటీన్, ఫైబర్, మంచి కొవ్వులు, విటమిన్ ఇ, అవసరమైన ఖనిజాలు సహజంగానే ఉంటాయి. ఇవి పండుగ వంటకాలకు ఒక స్మార్ట్ అడిషన్. ఇవి గుండె ఆరోగ్యానికి మద్దతు ఇస్తాయి. నిరంతర శక్తిని ఇస్తాయి. కడుపు నిండిన భావనను కలిగిస్తాయి. పండుగ సీజన్లో ఎక్కువగా తినే అలవాటు ఉన్నప్పుడు ఇది చాలా ముఖ్యం. బేకింగ్లో బాదంను ఉపయోగించడం వల్ల, ప్రజలు సంపూర్ణ పోషణ, శ్రేయస్సుకు మద్దతు ఇస్తూనే పండుగ ఆహారాలను ఆస్వాదించవచ్చు.

## ఏపీలో భవిష్యత్ సాంకేతిక నైపుణ్యాల బలోపేతానికి సామ్సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్

విజయవాడ మేజర్ న్యూస్ : భారతదేశ అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్సంగ్ విశాఖపట్నంలోని విజ్ఞాన్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డీఐఈటీ కళాశాలలో వరుసగా నిర్వహించిన సన్మాన కార్యక్రమాలతో, సామ్సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ (ఎస్ఐసి) కార్యక్రమం కింద భవిష్యత్ సాంకేతిక నైపుణ్యాల కల్పనలో తన వేగాన్ని మరింతగా పెంచింది. ఈ సంవత్సరం విశాఖపట్నంలోని విజ్ఞాన్ కళాశాల నుండి 500 మంది, డీఐఈటీ కళాశాల నుండి 250 మందికి, ఈ కార్యక్రమం కింద మొత్తం 750 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయబడ్డాయి. ఇది సాంకేతికత ఆధారిత భవిష్యత్తు కోసం భారతదేశ యువతను సిద్ధం చేయాలనే సామ్సంగ్ లక్ష్యంలో మరో మైలురాయిని సూచిస్తుంది.

## కృష్ణా టీడీపీ పార్లమెంటరీ నూతన కమిటీ నియామకం

అవనిగడ్డ, మేజర్ న్యూస్: కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నూతన కమిటీని పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఈ సందర్భంగా అవనిగడ్డ నియోజకవర్గం నుంచి పలువురు నాయకులకు కీలక బాధ్యతలు అప్పగించారు. పార్టీని బలోపేతం చేసే దిశగా అనుభవం, సేవాభావం కలిగిన నాయకులను కమిటీలోకి ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన లఖనం నాగాంజనేయులును జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించగా, రావి రత్నగిరిని జిల్లా అధికార ప్రతినిధిగా, కొల్లూరి బసవేశ్వరరావుని జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా ప్రకటించారు. అదే విధంగా అవనిగడ్డ ప్రకాశం, సోలె భార్గవి, తోట వెంకట నాగలక్ష్మిలను జిల్లా కార్యదర్శులుగా నియమించారు. నూతనంగా నియమితులైన నాయకులకు అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, సీనియర్ టీడీపీ నాయకులు, ఎన్నారై బొబ్బా గోవర్ధన్ లు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆశయాలను అనుగుణంగా బాధ్యతలు నిర్వర్తించి, ప్రజల్లో తెలుగుదేశం పార్టీకి మరింత ఆదరణ పెంచాలని వారు ఆకాంక్షించారు.

## గురుమూర్తికి శుభాకాంక్షలు తెలిపిన ఏఎంసీ చైర్మన్



పామర్రు మేజర్ న్యూస్: కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా నియమితులైన రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తిని పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుమూర్తి ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలో తెలుగుదేశం పార్టీ మరింత బలపడి విజయవంతం కాగలదనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. జిల్లాలో పార్టీ బలోపేతం కావడానికి గురుమూర్తికి తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామని శోభన్ బాబు పేర్కొన్నారు.

# టీ.కొత్తపాలెం పంచాయతి సందర్శించి ఆరోగ్యవనం ప్రారంభించిన కలెక్టర్



**నాగాయలంక డిసెంబర్ 24 మేజర్ న్యూస్ :** నాగాయలంక మండల పరిధిలోని టీ కొత్తపాలెం పంచాయతీ చేపట్టిన గ్రామ ఆరోగ్యవనం కార్యక్రమంలో జిల్లాలోని అన్ని పంచాయతీలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని క్రిష్ణా జిల్లా కలెక్టర్ డి కే.బాలాజీ పేర్కొన్నారు.బుధవారం ఉదయం టీ కొత్తపాలెం పంచాయతీని సందర్శించిన ఆయన మాట్లాడుతూ గ్రామ సర్పంచి శివపార్వతి పంచాయతీ కార్యదర్శి ఆది.అశోక్ లా చొరవతో గ్రామంలో వినూత్నమైన కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ప్రసంసించినారు పంచాయతీ పరిధిలో గ్రామ ఆరోగ్య వనం ఏర్పాటుచేసి వివిధ రకాల మెడిసినల్ ప్లాంట్స్ ను పెంచడం అభినందనీయమైన అంశమని కాలువగట్లు పోరంబోకు స్థలాలను సద్వినియోగం చేసుకొని పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు మంచి ఉదాహరణగా నిలుస్తాయని కలెక్టర్ బాలాజీ పేర్కొన్నారు గ్రామంలోని డంపింగ్ యార్డును పూర్తిగా శుభ్రపరచి పార్కుగా మార్చడం ప్రత్యేకంగా ప్రశంసనీయమని పేర్కొన్నారు ఇది స్వచ్ఛత, సౌందర్యం రెండిటిని సమన్వయంగా ముందుకు తీసుకెళ్లిన చక్కని ప్రయత్నం అని గ్రామ సేవ అనే కార్యక్రమం ద్వారా గ్రామస్తుల భాగస్వామ్యముతో అభివృద్ధి సాధించటం నిజమంగా ఆదర్శప్రాయమైన పని అని కలెక్టర్ తెలిపారు. ఈ విధమైన కార్యక్రమాలను జిల్లాలోని ప్రతి సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన సూచించినారు గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం ఎంత కీలకమో టీ కొత్తపాలెం పంచాయతీ నిరూపించినది అని తెలిపినారు.ఈ సందర్భంగా టీ.కొత్తపాలెం గ్రామపంచాయతీ సర్పంచ్ శివపార్వతి పంచాయతీ కార్యదర్శి ఆది అశోక్ ను కలెక్టర్ బాలాజీ శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపినారు.గ్రామ అభివృద్ధికి వారు చేసిన కృషి ఇతరులకు మార్గదర్శకంగా పిలుస్తుందని కలెక్టర్ కొనియాడినారు.ఈ కార్యక్రమంలో డిసి చైర్మన్ బండ్రెడ్డి మల్లికార్జున్ రావు మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ మండల రెవెన్యూ ఆఫీసర్ వివిధ శాఖల అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసినారు.

# పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ బహుకరణ



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** మండల పరిధిలోని ఐనపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 32 మంది విద్యార్థులకు దాతల సహకారంతో స్టడీ మెటీరియల్ అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు తెలిపారు. మండల పరిధిలోని వీరంకి గ్రామ వాస్తవ్యులు రాజులపాటి రాజేశ్వరి – మాధవరావు దంపతుల జ్ఞాపకార్థం వార కుమారులు అంకబాబు, వెంకటప్పయ్యలు ఈ స్టడీ మెటీరియల్ ను అందజేసినట్లు తెలిపారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో తయారుచేసిన సుమారు 2,500 రూపాయలు విలువగల ముఖ్యమైన స్టడీ మెటీరియల్ పుస్తకాలను ఉచితంగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాత రాజులపాటి వెంకటప్పయ్య మాట్లాడుతూ విద్యార్థులందరూ ఈ స్టడీ మెటీరియల్, మోడల్ పేపర్ లను ఉపయోగించుకుని, పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించడంతోపాటు ఎక్కువ మంది విద్యార్థులు 550 పైగా మార్కులు సాధించాలని సూచించారు. ఈ స్టడీ మెటీరియల్ పుస్తకాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు, ఉపాధ్యాయుల చేతుల మీదుగా విద్యార్థులకు దాతలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలరావు దాతలకు పాఠశాల విద్యా కుటుంబం తరపున కృతజ్ఞతలు తెలిపారు. దాతల సహకారాన్ని విద్యార్థులు ఉపయోగించుకుని భవిష్యత్తులో ఉన్నత స్థితికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈకార్యక్రమంలో వీరంకి గ్రామ వాస్తవ్యులు బొల్లా శ్రీనివాసరావు(ఆటో పండు), పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## గంగానమ్మ తల్లి దేవస్థానం సన్నిధిలో పుస్తక, కవిత్వ సంపుటి ఆవిష్కరణ

**నాగాయలంక డిసెంబర్ 24 మేజర్ న్యూస్ :** నాగాయలంక గ్రామంలో తల శిల వారి గంగానమ్మ తల్లి దేవస్థాన సన్నిధిలో ఈరోజు సబ్బినేని పద్మజా అక్షర తుటీరము – తార సితార కవిత్వములను అవనిగడ్డ శాసనసభ్యులు డాక్టర్ మండలి.బుద్ధ ప్రసాద్ ఆవిష్కరణ,చేసినారు. ఈ కార్యక్రమానికి, కి అతిధులుగా గుడిసేవ విష్ణు ప్రసాద్, ప్రముఖ మిమిక్రీ కళాకారులు భవిరి.రవి అక్షర తుటిరము ఎస్.బి కామేశ్వరి, తార – సితార అన్నపురెడ్డి వీర కుమారి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవనిగడ్డ, డాక్టర్ ఉమారాణి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ అవనిగడ్డ, జల్లూరి రమాదేవి,ప్రముఖ రచయిత్రి అవనిగడ్డ కలిమి శ్రీ ఎడిటర్ విజయవాడ, నన్నపనేని సునీల్ కుమార్ వివేకానంద విద్యాసంస్థలు అకాడమిక్ డీన్ తెనాలి, నాగాయలంక డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జున్ రావు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, మండవ బాలవర్ధి నరావు గంగానమ్మ తల్లి దేవస్థాన కమిటీ చైర్మన్ తలశిల శ్రీనివాసరావు ( మైసూర్ శీను)కమిటీ సభ్యులు, తల శిల శివరామకృష్ణ శివశంకర్, నాగాయలంక గ్రామానికి చెందిన కవులు– కళాకారులు, విచ్చేసి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆశాంతం వీక్షించి జయప్రదం చేసినారు.

## చిన్నారులకు 28న గ్రీటింగ్ కార్డ్ డిజైన్ కాంటెస్ట్




**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఈ తరం చిన్నారులకు గ్రీటింగ్ కార్డులకి ఉన్న ప్రాముఖ్యతను తెలియపరచి వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయాలనే ముఖ్య ఉద్దేశ్యంతో నగరానికి కి చెందిన "ఆర్టిజో" ఫైన్ ఆర్ట్స్ స్టూడియో మరియు"స్ఫూర్తి" క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28న "గ్రీటింగ్ కార్డ్ డిజైన్ కాంటెస్ట్" నిర్వహిస్తున్నట్లు ఆర్టిజో ఫైన్ ఆర్ట్స్ స్టూడియో ప్రిన్సిపల్ స్ఫూర్తి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కాంటెస్ట్ కి సంబంధించిన పోస్టర్ ని ఎన్.టి.ఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్క్రీన్ టైం ని తగ్గించేందుకు చిన్నారులకు ఇలాంటి కాంటెస్ట్ లు అవసరమన్నారు. పుట్టిన రోజు, పండుగలు, నూతన సంవత్సరం ఇలా పలు అంశాలపై ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టెక్నిక్ లు వాడి అబ్బురపరిచే గ్రీటింగ్ కార్డులు చిన్నారులు రూపొందించగలరని...ప్రస్తుత పరిస్థితుల్లో ఈతరం చిన్నారులకు ప్రేమ, ఆప్యాయతలతో ఇచ్చి పుచ్చుకునే గ్రీటింగ్ కార్డుల ప్రాముఖ్యత తెలియజేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. " పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎలిమెంట్ స్కూల్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ పసుమర్తి అమర దీప్తి, ఆర్టిజో ఫైన్ ఆర్ట్స్ స్టూడియో ప్రిన్సిపల్ స్ఫూర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు".

## రూ.70 వేల స్వంత నిధులతో చర్చికి రహదారి ఏర్పాటు చేస్తున్న సర్పంచ్ దంపతులు



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధి లోని శ్రీరంగపురం గ్రామంలో శృంగార దేవాలయం చర్చికి దాతలు విరాళాలు సమకూర్చి రహదారిని ఏర్పాటు చేస్తున్నారు. వై ఎ స్ ఆ ర్ సి పి నాయకులు, గ్రామ సర్పంచి దంపతులు దిమ్మెట పద్మావతి – రాంబాబు స్వంత నిధులు 70 వేల రూపాయల వ్యయంతో సిమెంట్ రహదారిని ఏర్పాటు చేస్తున్నారు. రహదారిని స్వంత నిధులతో ఏర్పాటు చేస్తున్న సర్పంచ్ దంపతులను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించిన కటకం, మొహమ్మద్ కాజా



**పెడన,మేజర్ న్యూస్ :** పట్టణంలో గల 5 వ వార్డు స్మశాన వాటికలో సీసీ రోడ్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తూచా తప్పకుండా పాటించాలని సీనియర్ కౌన్సిల్ సభ్యులు కటకం ప్రసాద్ అన్నారు. ఈ మేరకు అవార్డు కౌన్సిల్ సభ్యుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ కాజా తో కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగ కుమారి ఆదేశాల మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులతో పట్టణంలో గల స్థానిక 5 వ వార్డు లోని స్మశాన వాటిక లో అంచనా విలువ సుమారు 5.50 లక్షల రూపాయలతో కొత్తగా ఏర్పాటు చేయుచున్న సిమెంట్ రోడ్ పనులను పర్యవేక్షించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ కాజా, 6వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ ఖయ్యుం(బాబూలాల్), మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ కాగిత సీతారామాంజనేయులు, కాంట్రాక్టర్ ఏ హెచ్ వి మెహర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

## మా పోస్ట్ ఆఫీస్ మాకు కావాలి

### బ్రహ్మపురం వాసుల వినతి



**పెడన మేజర్ న్యూస్ :** ఎన్నో సంవత్సరాలుగా తమకు ఎంతో సేవను అందించిన బ్రహ్మపురం సబ్ పోస్టాఫీసు తరలించవద్దు అని ఆ ప్రాంత వాసులు చీఫ్ పోస్ట్ జనరల్ అజిత్ శర్మ ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ మేరకు ఆ ప్రాంతవాసులు ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బ్రహ్మపురం వాసులు ఒక ప్రకటనలో మాట్లాడుతూ తమ ప్రాంతంలో అనేక దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న సబ్ పోస్టాఫీసు తరలించడం వలన కలంకారి,చేనేత కార్మికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని, ఇక్కడ కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్న వారికి ఎంతో ఉపయోగ పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, కోసనం హేమకుమార్,కుర్మా సుధాకర్,ఉక్కేం శంకరరావు,పృథ్వీ వినోద్ తదితరులు ఉన్నారు.

# ప్రతి వినియోగదారుడు హక్కులపట్ల అవగాహన కలిగి ఉండాలి





**ఈ-జాగృతి పోర్టల్ ద్వారా ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో చేయొచ్చు**

**సోక్రటీస్ చెప్పినట్లు ప్రతి వినియోగదారుడు ప్రశ్నించే తత్వాన్ని కల్గి ఉండాలి**

**రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. ఢిల్లీ రావు**

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటంతోపాటు డిజిటల్ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్మ పౌర సరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. దిల్లీ రావు తెలిపారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం-2025 సందర్భంగా స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రంలో బుధవారం రాష్ట్ర స్థాయి వేడుకలను డిజిటల్ న్యాయపాలన ద్వారా సమర్ధ సత్వర పరిష్కారం అనే థీమ్ తో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. ఢిల్లీ రావు హాజరై మాట్లాడుతూ ప్రముఖ తత్వవేత్త సోక్రటీస్ పేర్కొన్న విధంగా ప్రశ్నించే తత్వాన్ని ప్రతి వినియోగదారుడు కల్గి ఉండాలన్నారు. వినియోగదారుల కోర్టుల తీర్పులు వేగంగా, సమర్ధవంతంగా వెలువడటంలో డిజిటల్ పద్ధతుల ప్రాముఖ్యతను వివరించారు.



పెరుగుతున్న సాంకేతికతతోపాటు వినియోగదారులకు ఇబ్బందులు కూడా ఏర్పడుతున్నాయన్నారు. 1986 వినియోగదారుల హక్కుల రక్షణ చట్టానికి, 2019 నాటి వినియోగదారుల హక్కుల రక్షణ చట్టానికి మధ్య ఉన్న వ్యత్యాసాలను వివరించారు. ముఖ్యంగా ఈ-కామర్స్ ఆన్ లైన్, సైబర్ మోసాల నేపథ్యంలో వినియోగదారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. గతంలో ఎక్కడైతే వస్తువు కొనుగోలు చేస్తామో ఆ కోర్టులోనే కేసు వేయాల్సి ఉండేదని ప్రస్తుత కొత్త చట్టం ప్రకారం, వినియోగదారుడు ఎక్కడ నివసిస్తుంటే అక్కడి నుండే ఆన్ లైన్ లో కేసు ఫైల్ చేసుకునే సౌకర్యం ఏర్పడిందన్నారు. కోర్టు విచారణలకు స్వయంగా హాజరు కావాల్సిన అవసరం లేకుండా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరు కావచ్చునన్నారు. బిస్ కేర్ యాప్ ద్వారా హాల్‌మార్క్, క్వాలిటీ కంట్రోల్ వంటి అంశాలపై ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. ఈ-జాగృతి యాప్ ద్వారా కేసు ప్రస్తుత స్థితి, ట్రాకింగ్, ఆన్ లైన్ లో ఫీజుల చెల్లింపు తదితరమైనవి ట్రాక్ చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. కొత్త చట్టం ప్రకారం, జిల్లా కోర్టులో పరిహారం ఎంతైనా అడగవచ్చు కానీ ఆ వస్తువు లేదా సేవ కోసం చెల్లించిన విలువ 50 లక్షల లోపు ఉండాలన్నారు.

వ్యక్తిగత అవసరాల కోసం వస్తువులను కొనేవారు మాత్రమే వినియోగదారులు అవుతారన్నారు. వ్యాపార లావాదేవీల కోసం వస్తువులు కొనేవారు ఈ చట్టం పరిధిలోకి రారన్నారు. ఫిర్యాదు చేసిన 21 రోజుల్లోపు సిసి (కన్స్యూమర్ కంప్లైంట్) నంబర్ ఇవ్వకపోతే, అది ఆమోదించబడినట్లుగా పరిగణించబడుతుందని వీసీ, ఎండీ ఎస్. ఢిల్లీ రావు తెలియజేశారు. పౌర సరఫరాల సంస్థ సంచాలకులు ఆర్. గోవిందరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బంగారు దుకాణాల్లో ఒక మిల్లీగ్రామ్ స్కేల్ ఖచ్చితత్వాన్ని అమలు చేయడం ఒక గొప్ప విజయమని, దీన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారన్నారు. యూరోపియన్ దేశాలతో పోలిస్తే భారతదేశంలో వినియోగదారుల అవగాహన ఇంకా పెరగాల్సి ఉందన్నారు. పాఠశాలల్లో కన్స్యూమర్ క్లబ్‌ల ద్వారా విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించాలని, డైరెక్టర్ ఆఫ్ కన్స్యూమర్ అఫైర్స్, జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషిని అభినందించారు. వినియోగదారులు తమకు అన్యాయం జరిగినప్పుడు బిల్లులు, వోచర్లు వంటి ప్రాథమిక ఆధారాలతో కేసు ఎలా ఫైల్ చేసుకోవాలో, ఆ విషయంలో జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు.ా

జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ సమాజంలో మనం ఏ వృత్తిలో ఉన్నా మనందరం వినియోగదారులమేనని, ప్రతి ఒక్కరూ తమ హక్కులను గురించి తెలుసుకోవాలన్నారు. వినియోగదారుడు ప్రశ్నించే హక్కును కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగం పెరగడంతో డిజిటల్ ఫ్రాడ్స్ పెరుగుతున్నాయని, దీనిపై వినియోగదారులు అవగాహన కల్గి ఉండాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించాలని అప్పుడే చైతన్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. బిస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) డైరెక్టర్ ప్రేమ్ సజానీ పట్నాలా మాట్లాడుతూ వినియోగదారులు కొనుగోలు చేసిన వస్తువు హాల్ మార్క్ క్వాలిటీ కంట్రోల్ వంటి అంశాల పై ఫిర్యాదు చేయాలనుకుంటే బిస్ కేర్ యాప్ లో ఉచితంగా ఫిర్యాదు చేయొచ్చు అన్నారు. లీగల్ మెట్రాలజీ శాఖ జాయింట్ కంట్రోలర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు తూకాల మోసాలను ప్రశ్నించినప్పుడే వ్యాపారస్థులు భయానికి గురై మోసానికి పాల్పడరన్నారు. కార్యక్రమం అనంతరం వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించే పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా, సివిల్ సప్లైస్ అదనపు సంచాలకులు కె. రంగ కుమారి, జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఏ. పాపారావు, ఏఎస్వో వేంపాటి శ్రీనివాసులు, విద్యార్థులు, ఎన్జీవో లు, తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత







**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషీన్లు (ఈవీఎం), వీవీప్యాట్ల గోదాముకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని.. అయినా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సమన్వయ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా సాధారణ నెలవారీ తనిఖీలతో పాటు మూడు నెలలకోసారి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి త్రైమాసిక తనిఖీలు నిర్వహించడంలో భాగంగా గా విజయవాడ గ్రామీణం, గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ల గోదామును కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరుతో పాటు అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను అందించడం జరుగుతోందన్నారు. అదేవిధంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనూ త్రైమాసిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని సూచించినట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, ఎదుపాటి రామయ్య (తెలుగుదేశం), వై.ఆంజనేయ రెడ్డి (వై.ఎస్.ఆర్.సి.పి), బొంతు కృష్ణారెడ్డి (బీజేపీ), బొర్రా కిరణ్ (కాంగ్రెస్) తదితరులు పాల్గొన్నారు.

# క్రీస్తు బోధనలు ఆదర్శనీయం

**ప్రజలకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ క్రిస్మస్ శుభాకాంక్షలు**



**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఏసుక్రీస్తు త్యాగం అందరికీ ఆదర్శనీయమని.. క్రీస్తు జన్మదినం క్రిస్మస్ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సవాలతో ఆనందంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసు ప్రభువు ప్రేమ, కరుణ అనుసరణీయమని.. దైవదూతగా వచ్చిన ఏసు.. త్యాగం, ప్రేమ, కరుణలతో ప్రజలందరికీ ఒక మార్గం చూపారని తెలిపారు. పాపులను కూడా క్షమించడం, ఆయన క్షమాగుణానికి నిదర్శనమని అన్నారు. ఆయన చూపిన మార్గం స్ఫూర్తిదాయకమన్నారు. ఇతరులకోసం కూడా ప్రార్ధనలు చేసే గొప్ప మనసు క్రైస్తవుల సొంతమని పేర్కొన్నారు. ఈ పర్వదినం జిల్లా ప్రజలందరికీ ఆనందం, ఆరోగ్యం, సమృద్ధి తీసుకురావాలని ఆకాక్షించారు. క్రీస్తు కరుణతో జిల్లా అగ్రగామిగా నిలవాలని కోరుకుంటూ డా. లక్ష్మీశ శుభాకాంక్షలు తెలిపారు.

# హిట్ & రన్ కేసులలో బాధితులకు ఊరట



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** అతని పేరు ఎండీ.ఫారుక్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, పొట్ట చేత పట్టుకుని కుటుంభ సభ్యులతో గుంటూరు జిల్లా తాడేపల్లి వచ్చి నూడుల్స్ బండి పెట్టుకుని జీవిస్తూ ది 09.06.2024 వ తేదిన భార్యని తీసుకుని విజయవాడ సరుకుల కోసం వచ్చి తిరిగి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం వచ్చి గుద్దుట వలన అతని భార్య రోడ్ మీద పడి దెబ్బలు తగిలి ఆసుపత్రి లో చికిత్స పొందుచు చనిపోయింది. ఎండీ ఫారుక్ కి భాష రాదు. కానీ మన పోలీసు కమిషనర్ ఉత్తర్వుల మేర ఫారూక్ కు ఫోన్ చేసి నష్టపరిహారం రూ.2,00,000/- వస్తాయని చెప్పి అయన బ్రతుకు తెరువు కోసం నెల్లూరులో ఉన్న అక్కడి తహసిల్దార్‌తో మాట్లాడి సంబందిత పత్రాల ను వారికీ పంపి వారి నుండి క్లెయిమ్స్ ఎంక్వయిరీ ఆఫీసర్ వారికీ వారి నుండి జిల్లా కలెక్టర్‌కి పంపి వారినుండి జిఐసి, ముంబై వారికీ పంపి త్వరితకాలంలోనే వారికీ నష్టపరిహారం రూ.2,00,000/- వారి బ్యాంకు ఎకౌంటు కి మంజూరు చేయించినారు. ఈ కేసు ఒక ఉదాహరణ మాత్రమే, ఇలాంటి కేసులు సుమారు 50 కేసులు ఉన్నాయి. ఈ క్రమంలో ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ లో ఇప్పటి వరకు 51 హిట్ అండ్ రన్ కేసుల్లో చనిపోయిన వారి న్యాయపరమైన వారసులకు రూ.1,02,00,000/- లను, 187 కేసులలో బలమైన దెబ్బలు తగిలిన 196 మంది భాదితులకు రూ.98,00,000లను మొత్తంగా రూ.2,00,00,000/- లను మంజూరు చేయించి భాధితులకు అండగా నిలిచిన పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం లోనే ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ ను ప్రథమ స్థానంలో ఉంచారు. రోడ్డు ప్రమాదాల్లో నిందితుడుని గుర్తించలేని హిట్ అండ్ రన్ కేసుల బాధితులకు సుప్రీంకోర్ట్ ఉత్తర్వుల మేరకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో జిఐసి వారి ద్వార నష్ట పరిహారం అందిస్తోంది. బాధిత కుటుంబాలకు న్యాయం చేకూర్చే దిశగా పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో పరిహార దరఖాస్తులను వేగంగా పరిష్కరిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, అవసరమైన పత్రాలను సేకరించిన అనంతరం హిట్ అండ్ రన్ పథకం కింద బాధితులకు ఆర్థిక సహాయం మంజూరు చేస్తున్నారు. ఈ ప్రక్రియను సులభతరం చేయడానికి ప్రత్యేకంగా అధికారులు పర్యవేక్షణ చేపట్టారు. ఇప్పటివరకు అనేక మరణాలు, గాయాల కేసుల్లో పరిహారం బాధితులకు అందజేయడం జరిగింది. మిగిలిన కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాద బాధిత కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ఈ పథకం ఎంతో దోహదపడుతోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో ఎవరూ నిర్లక్ష్యానికి గురికాకుండా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని పోలీస్ అధికారులు స్పష్టం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు హిట్ అండ్ రన్ కేసుల్లో ప్రాణనష్టం సంభవించిన కేసుల్లో వారి ఆప్తులను కోల్పోయిన కుటుంబాలు ఆర్థికంగా కుదేలుకాకుండా ప్రభుత్వం అండగా నిలుస్తుందని సీఎం స్పష్టం చేశారు. అలాగే గాయపడిన బాధితులకు కూడా తగిన ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ చర్యల ఫలితంగా ఇప్పటికే అనేక కేసుల్లో బాధిత కుటుంబాలకు పరిహారం నేరుగా అందజేయడం జరిగింది. ఈ క్రతువు లో కీలక మైన పాత్ర పోషించిన ట్రాఫిక్ డి.సి.పి. షరీన్ బేగం, ట్రాఫిక్ ఏ.సి.పి. పి.రామచంద్రరావు, హెడ్ కానిస్టేబుల్ 4228 ఎన్.వి.శ్రీనివాసరావు, పోలీసు కానిస్టేబుల్ 3545 వి.లీల సాయి కిరణ్ లను ప్రశంసా పత్రాలతో నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ప్రత్యేకంగా అభినందించడం జరిగింది.

# ఏసుక్రీస్తు బోధనలు ఆదర్శ జీవనానికి మార్గం

**విజయవాడ పార్లమెంట్ కార్యాలయంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు**

**క్రిస్మస్ కేక్ కట్ చేసిన ఎంపీ కేశినేని శివనాథ్**

**ప్రజలకు ఎంపీ కేశినేని శివనాథ్ క్రిస్మస్ శుభాకాంక్షలు**



**విజయవాడ మేజర్ న్యూస్ :** ఏసుక్రీస్తు బోధనలు ఆదర్శ జీవనానికి మార్గమని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. క్రిస్మస్ సందర్భంగా బుధవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ , క్రిస్టియన్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొని కేక్ కట్ చేసి.. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మత పెద్దలు ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ప్రపంచానికి ప్రేమ, శాంతి ,సేవ అనే విలువలను అందించిన ఏసుక్రీస్తు నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలన్నారు. ప్రపంచంలో జరిగే అతిపెద్ద పండుగ క్రిస్మస్ అన్నారు. క్రీస్తు బోధనలు, ఆయన చూపి బాటను అంతా అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ కె.నాగుల్ మీరా, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, ఎన్టీఆర్ జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు ఉర్ల మోహనరావు, ఎన్టీఆర్ జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు గొర్రి శ్రీనివాస చక్రవర్తి, టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి పరిశపోగు రాజేష్ (దళిత రత్న), స్టేట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బుద్దకోళ్ల ప్రేమరాజు, మరనాత విశ్వాస సమాజం పాస్టర్ విశ్వప్రసాద్, పాస్టర్ డెవిడ్ బ్రెన్ హెూమ్, గ్రేస్ మినిస్ట్రీయస్ బిషప్ ఎలిషా, వన్ టౌన్ పాస్టర్ పెలోషిఫ్ అధ్యక్షుడు మ్యాథూస్, రాష్ట్ర క్రిస్టియన్ సెల్ నాయకుడు ఇత్తడి చార్లెస్, చాట్ల రాజశేఖర్, సంకె విశ్వనాథం, మాదిగాని గురునాథం,ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి అర్బన్ కో-ఆర్డినేటర్ వల్లభనేని నరసింహాచౌదరి లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ పండుగ సందర్భంగా మహిళా సిబ్బందికి చీరలు పంపిణీ



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** పోలీసు కమిషనర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎన్.టి.ఆర్.జిల్లా సురక్ష కమిటీ కన్వీనర్ కె నరసయ్య, సాయి తేజ, మెడ్ ప్లస్, నాట్కో ల ఆధ్వర్యంలో ఎన్.టి.ఆర్.పోలీసు కమిషనర్ రేట్‌లో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి చీరాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్ ముఖ్య అతిదిగా పాల్గొని అంధరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ కేకు కట్ చేయడం జరిగింది. అనంతరం మహిళా సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగర పోలీసు కమిషనర్ మాట్లాడుతూ..... ముందుగా క్రైస్తవ సోదరులు అంధరికి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు, పండుగల ఆదర్శాలు, సిద్ధాంతాలను అందరూ పాటించాలని, ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలు మీరందరితో కలిసి జరుపుకోవడం ఎంతో సంతోషంగా, ఆనందదాయకంగా ఉందని తెలియజేశారు. అనంతరం సెమి క్రిస్మస్ కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసారు. అధెవిధంగా సురక్ష కమిటీ కన్వీనర్ కె నరసయ్య, సాయి తేజ కన్సల్టెన్సి, మెడ్ ప్లస్, నాట్కో వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలలో సేఫ్టీ కల్చర్ తీసుకురావడమే లక్ష్యంగా చేసుకుని సురక్షా కమిటీలను ఏర్పాటు చేశారు. నగరంలో సుమారు పది వేల సి.సి.కెమెరాలు ఏర్పాటు చేయడానికి ఈ సురక్షా కమిటీలు కీలకంగా వ్యవహరించారు, మానవ సేవే మాధవ సేవ అనే విధానాన్ని అవలంబిస్తూ మహిళా పోలీసు సిబ్బందికి ఉచిత మెడికల్ క్యాంప్ లను నిర్వహించారు. సురక్ష కమిటీ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే పర్యావరణ పరిరక్షణ, కొండలపై నివసించే కోతులు పక్షులకు ఆహారం అందించే ఉద్దేశ్యంతో మొత్తం 70 వేల విత్తనాలను డ్రోన్ల ద్వారా కొండలపైన చల్లించడం జరిగింది. ఈ రోజు మహిళా సిబ్బందికి సురక్ష కమిటీ కన్వీనర్ కె నరసయ్య, సాయి తేజ కన్సల్టెన్సి, మెడ్ ప్లస్, నాట్కో వారి ఆద్వర్యంలో చీరల పంపిణీ చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, డి.సి.పి. కృష్ణ కాంత్ పటేల్ , డి.సి.పి. కె.జి.వి. సరిత, డి.సి.పి.శ్రీ ఎస్.వి.డి.ప్రసాద్, ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. సోమయ్య, సురక్షా కమిటీ కన్వీనర్ కుదరవల్లి నరసయ్య, సాయి తేజ కన్సల్టెన్సి, మెడ్ ప్లస్, నాట్కో ప్రతినిధులు, తదితరులు పాల్గొనడం జరిగింది.




## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. పురిటిగడ్డ ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా క్రీస్తు జనన నాటికను అత్యద్భుతంగా ప్రదర్శించారు. ఐవీఎం డైరెక్టర్ డా. వేములపల్లి సురేష్ రోజా దంపతులు పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఐవీఎం ప్రతినిధులు వేములపల్లి విజయ, సోఫి, విద్యార్థినీ విద్యార్థులు, విశ్వాసులు పాల్గొన్నారు. అనంతరం క్రిస్మస్ క్యారల్స్ ఆలపించారు.

## కనకమేడల రవీంద్రకు అభినందనలు తెలిపిన ఎంపీ కేశినేని , ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



**విజయవాడ మేజర్ న్యూస్ :** సుప్రీంకోర్టులో భారత ప్రభుత్వ అదనపు సొలిసిటర్ జనరల్‌గా నియమితులైన సీనియర్ న్యాయవాది, టిడిపి మాజీ రాజ్యసభ ఎంపీ కనకమేడల రవీంద్రను ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అభినందనలు తెలిపారు. బుధవారం లబ్బీపేటలోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి కొండపల్లి బొమ్మను బహుకరించారు. రాజ్యసభ సభ్యునిగా విశేష సేవలందించిన కనకమేడల రవీంద్ర, ఇకపై అత్యున్నత న్యాయస్థానంలో కేంద్ర ప్రభుత్వం తరుపున కీలక వాదనలు వినిపించనుండటం ఎంతో ఆనందంగా వుందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. దేశంలోనే ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ పదవిలో తెలుగు వ్యక్తి...నియమితులు కావటం ఎంతో గర్వంగా వుందని ఎమ్మెల్యే గద్దె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య పాఠశాలలో ఆనందోత్సాహాలతో క్రిస్మస్ వేడుకలు





**కృష్ణలంక మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీ చైతన్య కృష్ణలంక శాఖలో ప్రేమ, దయ, త్యాగం, శాంతిని పంచే పవిత్రమైన పండగ క్రిస్మస్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించి, పండుగ ప్రాధాన్యాన్ని విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మహాలక్ష్మి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వందల కోట్ల మంది ప్రజలు జరుపుకునే సాంస్కృతిక పండుగ బైబిల్ యొక్క సొంతమైన ప్రేమ, శాంతి కరుణ, క్షమ, అందరిపట్ల దయ కలిగి ఉండాలని ఈ గుణాలను చిన్నతనం నుండి అలవర్చుకొని, మానసిక దృఢవంతులుగా భవిష్యత్తులో గొప్పవారు కావాలని ఆకాంక్షించారు. క్రిస్మస్ పవిత్రమైన రోజుగా భావించి ప్రార్థనలు చేసారు. యేసుక్రీస్తు జీవితం నుండి ప్రేరణ పొంది, సేవతో నిండిన జీవితాన్ని గడపాలని తెలియజేయడమే నిజమైన క్రిస్మస్ లాటిన్ భాషలో క్రైస్ట్ అనగా క్రీస్తు, ఆనందించడమే క్రిస్మస్



అనగా ఆరాధన అంటే క్రీస్తును ఆరాధించి ఆనందించడమే క్రిస్మస్ అన్నారు. ప్రతి విద్యార్థి క్రీస్తూ జీవితం ద్వారా బైబిల్ చదవడం ద్వారా ఉన్నత విలువలతో కూడిన జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆనందోత్సాహాలతో పాల్గొని క్రిస్మస్ ట్రీ అలంకరించి, శాంతాక్లాస్ ఏంజల్స్ మొదలైన వేషదారణలు ధరించి స్వీట్స్, చాక్లెట్స్ పంచారు. పలురకాల వేషధారణలు ధరించి నృత్య ప్రదర్శనలు, నాటకి ప్రదర్శనల ద్వారా యేసు క్రీస్తూ గొప్పతనాన్ని, బైబిల్ ప్రాధాన్యాన్ని అత్యంత మనోహరంగా ఆనందోత్సాహాలతో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈజియం. యం.మురళి కృష్ణ, ఆర్ ఐ ఐజె.రాజేష్ బాబు, ఇన్ చార్జులు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

### రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి

# ఎన్.హెచ్.ఏ.ఐ రీజినల్ ఆఫీసర్‌తో చర్చించిన ట్రాఫిక్ డి.సి.పి.





**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమిషనరేట్ పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డి.సి.పి. షరీన్ బేగం, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు బాలమురళీకృష్ణ, రామారావు, సత్య రమేష్, కిషోర్ బాబు బుధవారం కృష్ణలంక పోలీసు స్టేషన్ పరిధిలోని ఎన్.హెచ్.ఐ.ఏ. కార్యాలయంలో రీజినల్ ఆఫీసర్ రాకేశ్ కుమార్ సింగ్‌ని కలవడం జరిగింది. ఈ నేపథ్యంలో నేషనల్ హైవే రహధారుల పై రోడ్డు ప్రమాదాల నివారణ కు, ట్రాఫిక్ రద్దీ తగ్గించడం కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి ట్రాఫిక్ డి.సి.పి. షరీన్ బేగం, ఇన్స్పెక్టర్ ఎన్.హెచ్.ఏ.ఐ కార్యాలయంలో రీజినల్ ఆఫీసర్ రాకేశ్ కుమార్ సింగ్ తో కూలంకషంగా చర్చించడం జరిగింది.

అదేవిధంగా నేతాజీ బ్రిడ్జ్ వద్ద రోడ్డు ప్రమాదాలను నివారించ డానికి ఒక సబ్ వే ను నిర్మించాలని, ఎనికెపాడు సమీపంలో ఒక క్రేన్‌ను ఏర్పాటు చేయాలని కొరడమైనది. దీనిపై రీజినల్ ఆఫీసర్ సానుకూలంగా స్పంధిస్తూ సుముఖత వ్యక్తం చేశారు.

# పటమట నారాయణ స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు



**విజయవాడ, మేజర్ న్యూస్ :** పటమట నారాయణ స్కూల్‌లో బుధవారం క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా క్లస్టర్ ప్రిన్సిపాల్ ముత్తా రెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ విశిష్టత గూర్చి విద్యార్థులకు తెలియజేశారు క్రిస్మస్ పండుగ ప్రాధాన్యత, విశిష్టత ఏమిటంటే క్రీస్తును ఆరాధించి ఆనందించడమే అని అన్నారు. క్రీస్తు జన్మించి 2000 సంవత్సరాలు దాటిన కరుణామయుడుగా, దయామయుడుగా ఆయన క్రైస్తవ సోదరుల ఆరాధనను అందుకుంటున్నాడన్నారు. జీసస్ సందేశం ఆయన బోధనలు లోకానికి ఎంతో ఆదర్శనీయమని కొనియాడారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ, క్రిస్మస్ ట్రిప్ అందర్నీ ఎంతగానో అలరించాయి. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన జీసస్, శాంతా క్లాస్, మేరీమాత వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సాంస్కఅతిక ప్రదర్శనలో భాగంగా ప్రదర్శించిన క్రిస్మస్ గీతాలు డాన్సులు వివిధ స్కిట్లు అందర్నీ ఆకర్షితులుగా చేశాయి. ప్రపంచమంతా ఈ క్రిస్మస్ పండుగను అతి ముఖ్యమైన పండుగగా జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శామ్యూల్ రాజు, ఇ – కిడ్జ్ కోఆర్డినేటర్ సరళ, ఇ – చాంప్స్ కో ఆర్డినేటర్ జహూర్ ఫాతిమా, వైస్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## నూతన చెత్త సేకరణ బండ్లను ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** నగరంలోని 50 డివిజన్లో శానిటేషన్ పనులను మెరుగుపరిచేందుకు నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ బాపిరాజు నూతన చెత్త సేకరణ తోపుడుబండ్లను కొనుగోలు చేశారు. ఈ చెత్త సేకరణ తోపుడుబండ్లను, 850 డబ్బాలను గనుల,భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. నగరపాలక సంస్థ కొనుగోలు చేసిన 76 తోపుడు బండ్లు విలువ అక్షరాల 19 లక్షల 80 వేలుగా, డబ్బాలు 9 లక్షల 50 వేల రూపాయలుగా తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత పై కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, డీసీఎంసీ చైర్మన్ బండి రామకృష్ణ, జనసేన పార్టీ నాయకులు గడ్డం రాజు, తెలుగు దేశం సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కుబియా ,తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు , కూటమి నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## యువజనోత్సవాల్లో కెయూ ప్రతిభ

### దక్షిణాది స్థాయిలో రన్నరప్.. - ఫోక్ డాన్స్, నృత్య పోటీల్లో ప్రథమ స్థానం




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** చెన్నై హిందూస్థాన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల యువజనోత్సవాల్లో కృష్ణా విశ్వవిద్యాలయం ప్రతిభ కనభర్ చి మూడవ రన్నరప్ గా నిలిచింది. ఈ నెల 19 వ తేదీ నుండి 23 తేదీ వరకు దక్షిణ భారత స్థాయిలో జరిగిన యువజనోత్సవాల్లో నృత్య పోటీల్లో ప్రథమ స్థానం సాధించడమే కాకుండా పదమూడు రకాల అంశాల్లో పలు బహుమతులు సాధించి సత్తా చాటారు. క్లాసికల్ వోకల్ సోలో లో ద్వితీయ బహుమతి, క్లాసికల్ పర్క్యూషన్ లో నాల్గవ స్థానం, క్లాసికల్ నాన్ పిర్క్యూషన్ లో ద్వితీయ స్థానం, లైట్ వోకల్ సోలో లో మూడవ బహుమతి, ఇండియన్ గ్రూప్ సాంగ్ విభాగం లో మూడవ స్థానం లో పొందింది. ఫోక్ ఆర్కెస్ట్రా లో నాల్గవ స్థానం, క్రియేటివ్ కోరియోగ్రఫీ లో నాల్గవ స్థానం, ఫోక్ డాన్స్ లో ప్రథమ స్థానం, వన్ యాక్ట్ ప్లే లో నాల్గవ స్థానం, స్కిట్ లో నాల్గవ స్థానం, మిమిక్రీ లో ఐదవ స్థానంలో, రంగోలి లో నాల్గోవ స్థానం సాధించడమే కాకుండా ఓవర్ ఆల్ డాన్స్ కేటగిరీలో ప్రథమ స్థానంలో నిలవడం విశేషం. దక్షిణ భారత స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల యువజనోత్సవాల్లో మంచి ప్రతిభ కనబరిచి మూడవ రన్నరప్‌గా నిలిచి బహుమతులు సాధించిన కృష్ణా విశ్వవిద్యాలయం బృందంకు ఉపకులపతి ఆచార్య కె. రాంజీ, రెక్టర్ ఆచార్య ఎంవి. బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. ఉష అభినందనలు తెలిపారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకటట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999